సాక్షి
నిర్మల్

ఆదివారం । 19 । మే । 2024



పిల్లలపై ఓ కన్నేయండి...!

ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు. పిల్లలు, టీనేజ్ యువత పక్కదారులు పడుతున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. 8లో▸



ఆర్‌అండ్‌బీ.. అధికారులేరి..?

భైంసా ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో సిబ్బంది లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇన్‌చార్జి డీఈఈ, జూనియర్ అసిస్టెంట్ మినహా ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
38.4 /28.8

వాతావరణం

చాలా వరకు ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రధాని బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: వివిధ రంగాలలో ప్రతిభ చూపిన 5 నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికలు ప్రధానమంత్రి బాల పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు, సంస్థలు https://awards.gov.in/ వెబ్‌సైట్‌లో జూన్ 31లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 8247685975, 9963738012 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దేవరకోటలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నిర్మల్: జిల్లా కేంద్రంలోని చారిత్రక దేవరకోట లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలో పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు అయ్యన్నగారి శ్రీనివాస్, దార్ల రాజేశ్వర్, జాప అనిల్, దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఐటీఐ కాలేజీల్లో 2024 సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడినట్లు నిర్మల్ ఐటీఐ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ititelangana.gov.in వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్ పూర్తి చేయాలన్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ ఐటీఐ కళాశాలలో 2024 విద్యా సంవత్సరంలో ఎలక్ట్రీషియన్ 80, ఫిట్టర్ 20, రిఫ్రిజిరేషన్, ఏసీ కోర్సులో 24, వెల్డర్ 40, డీజిల్ మెకానిక్ 18, కంప్యూటర్ ఆపరేటింగ్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ 48, డ్రెస్ మేకింగ్‌లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో సోలార్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు పదో తరగతి మెమో, బోనఫైడ్ (4 నుంచి 10 వరకు) ఆధార్ జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రము, కలర్ ఫొటో, ఈ మెయిల్ ఐడీ, సర్టిఫికెట్స్ అప్లోడ్ చేసి ఆప్షన్స్ ఎంచుకోవాలన్నారు. జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తులకు చివరి తేదీ ఉందని పేర్కొన్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని విఠాపూర్‌లో కొనసాగుతున్న పనులను శనివారం పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు తదితర నిర్మాణం పనులను జూన్ 5లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు నాణ్యతతో చేయాలన్నారు. ఆయనవెంట పీఆర్ డీఈ సురేశ్, హెచ్‌ఎం సాయినాథ్, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు ఉన్నారు.

జిల్లాకు చేరుతున్న యూనిఫాం వస్త్రం



వస్త్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేసే యూనిఫామ్ వస్త్రం మొదటి విడతగా శనివారం జిల్లాకు వచ్చాయి. చేనేత వస్త్రపరిశ్రమ శాఖ నుంచి 150 బేళ్లతో కూడిన వస్త్రం జిల్లాకు చేరుకుంది. వీటిని జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో అధికారులు భద్రపరిచారు. ఇందులో మూడు రకాల వస్త్రం మాత్రమే వచ్చిందని, ఇంకా రెండు రకాల వస్త్రం రావాల్సి ఉందని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు మూడురోజుల్లో మండలాలవారీగా విభజించి ఆయా పాఠశాలలకు అందజేస్తామని తెలిపారు. జూన్ 5లోపు కుట్టించి పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు అందేలా చూడాలని స్వయం సహాయక సంఘం సభ్యులకు తెలిపారు.

ఓట్ల పండుగ చేశారు



ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద డీఆర్‌డీవో, సిబ్బంది



పచ్చదనంతో ఆదర్శ పోలింగ్ కేంద్రం



ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్(ఫైల్)



లింబాలో రైతు కాన్సెప్ట్ పోలింగ్ కేంద్రం వద్ద..

- పచ్చని పందిళ్లువేసి..
- ధాన్యపు కుచ్చులు కట్టి..
- 'ఉపాధి'కి మార్గాన్ని చూపి..
- 'ఆదర్శం'గా నిలిచిన అధికారులు

నిర్మల్: గృహప్రవేశం.. పెళ్లి.. ఇలా ఇంట్లో ఏ శుభ కార్యమున్నా పచ్చని పందిళ్లు వేస్తుంటాం. మామిడాకుల తోరణాలు కడుతుంటాం. ఒకప్పుడైతే.. పెళ్లిళ్ల కొబ్బరి ఆకులతో వేసిన మండపాల్లోనే జరిగేవి. మామిడాకులు, బంతిపూల తోరణాలతోపాటు అతిథులకు ధాన్యపు సిరులు స్వాగతం పలికేందుకు వరి కుచ్చులను అందంగా అలంకరించి ఆహ్వానించేవారు. కాలక్రమంలో అవన్నీ మాయమైపోయాయి. ఇప్పుడెన్ని రంగుల లైట్లున్నా.. ఒకదాన్ని మించి ఒక హంగులున్నా.. అప్పటి ఆ పచ్చదనం ఇచ్చే అనుభూతి కలుగడం లేదు. నాటి అనుభూతిని ఎన్నో ఏళ్ల తర్వాత మన జిల్లా అధికారులు ఓటర్లకు కలిగించారు.

ప్రత్యేకంగా ముస్తాబు..

పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు జిల్లా అధికారులు వివిధ ప్రయత్నాలు చేశారు. ఈసారి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సహకారంతో 'స్వీప్'(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఇన్‌చార్జిగా ఉన్న డీఆర్డీవో విజయలక్ష్మి వినూత్న ప్రయోగాలు చేశారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ప్రతీ నియోజకవర్గంలో ఒక ఆదర్శ పోలింగ్ కేంద్రం కచ్చితంగా ఉండాలి. ఈమేరకు జిల్లాలోనూ మూడు నియోజకవర్గాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రతీ ఎన్నికల్లో టెంట్లు, మంచినీళ్లు, రెడ్‌కార్పెట్లు ఇలాంటి వాటితో ఓటర్లను ఆకట్టుకునేవారు. ఈసారి మాత్రం ప్రత్యేకంగా నిలిపారు. నిర్మల్‌లో పూర్తిగా కొయ్యబొమ్మలతో, కుంటాల మండలం లింబా(కె)లో పూర్తిగా రైతులతో.. ఇలా థిమాటిక్ పోలింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేకతను చాటారు.

ఇంట్లో శుభకార్యంలా..

తమ ఇంట్లో శుభకార్యం ఉంటే ఎలా పనిచేస్తారో.. అలా ఆదర్శ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంలో డీఆర్డీవో విజయలక్ష్మి, ఆమె బృందం పనుల్లో భాగమయ్యారు. మామిడి తోరణాలను అల్లడంలో అధికారితోపాటు సిబ్బంది తలోచేయి వేశారు. దశాబ్దం క్రితం వరకు కనిపించిన కొబ్బరి ఆకుల పందిళ్లను అల్లేవారిని వెతికి పట్టుకువచ్చారు. పెద్దగా ఖర్చు లేకుండా స్థానికంగా కొబ్బరి, మామిడిఆకులు, పొరకను సేకరించారు. వెదురు కర్రలను మాత్రం అద్దెకు తీసుకువచ్చి పందిళ్లు వేయించారు.

పెళ్లింట్లోకి వచ్చినట్లే..

'అసలు ఇది పోలింగ్ కేంద్రంలా లేనేలేదు.. పెళ్లింటికి వచ్చినట్లు ఉంది..' అంటూ ఈనెల 13న ఓటర్లంతా సంబురంగా వచ్చి ఓట్లేశారు. ఎప్పుడో 10–15 ఏళ్ల క్రితం కళకళలాడిన పచ్చని కొబ్బరి ఆకుల పెళ్లిపందిరిని మళ్లీ తీసుకువచ్చారు. పోలింగ్ కేంద్రం ఎదుట మామిడి ఆకుల తోరణాలు కట్టి చలువ పందిళ్లు వేశారు. పోలింగ్ కేంద్రం గేట్ల వద్ద కొబ్బరి, అరటి కొమ్మలను కట్టారు. మొత్తం మీద ఓ పెళ్లింటికో.. ఓ శుభకార్యానికో.. వచ్చామన్న ఫీలింగ్‌ను ఓట్లరకు కల్పించారు. ఎర్రటి ఎండలో వచ్చినవాళ్లంతా ఆ చలువ పందిళ్ల నీడలో సేద దీరుతూ ఓటేయడం కనిపించింది.

'ఉపాధి' మార్గంలో..

ఓట్ల పండుగరోజున తీర్చిదిద్దిన ఆదర్శ పోలింగ్ కేంద్రాల కాన్సెప్ట్ డీఆర్డీవోకు 'ఉపాధి' మార్గాన్ని చూపాయి. ఈ కేంద్రాల అలంకరణలో భాగంగా ప్రధానంగా ఆకట్టుకున్న వరికుచ్చులను చాలామంది తమకు కావాలని అడిగారు. దీంతో వీటిని పెద్దమొత్తంలో తయారు చేయించి మహిళా సమాఖ్యల ద్వారా విక్రయించి ఉపాధిని అందించేలా డీఆర్డీవో ఆలోచన చేశారు. సోషల్ మీడియాలో చూసి ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన కొంతమంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం వాటిని కావాలంటున్నారు. ఇంటి ముందు వేలాడదీస్తే మంచిదని అనుకోవడం, పిచ్చుకలకు ఆహారంగా వడ్లగింజలు ఉపయోగపడుతుండటంతో చాలామంది ముందుకు వస్తున్నారు. మహిళా సమాఖ్య ద్వారా వాటి తయారీని చేపడుతున్నారు. ఇలా ఓట్ల పండుగ సంబురంగా సాగడమే కాకుండా.. మహిళలకు ఉపాధి చూపింది.

చాలామంది అడుగుతున్నారు..



పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇందులో దాదాపు ఎకో ఫ్రెండ్లీగా ఉండేలా పచ్చని ఆకులతోనే అలంకరణలు చేశాం. ప్రధానంగా వరికుచ్చులు ఓటర్లను, అధికారులను ఆకట్టుకున్నాయి. కలెక్టర్, ఎస్పీ గారు కూడా మెచ్చుకున్నారు. ఇక వీటిని మహిళ సమాఖ్యలు ఉపాధి పొందేలా పెద్దమొత్తంలో తయారు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

చాలాబాగా చేశారు..



పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో విజయవంతంగా పూర్తిచేయడంలో అధికారులందరూ సహకరించారు. సమష్టి కృషితో పూర్తిచేశాం. పోలింగ్‌శాతం పెంచడానికి ఆదర్శ పోలింగ్ కేంద్రాలను చాలా బాగా తీర్చిదిద్దారు. స్వీప్ ఆధ్వర్యంలో ఆకట్టుకునేలా తయారు చేశారు. ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో చాలా మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్

వరికుచ్చులు.. స్పెషల్..



ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లిన ఓటర్లను ప్రత్యేకంగా ఆకర్షించినవి.. వరికుచ్చులు. వడ్లతో కూడిన ఈ ధాన్యపు సిరులను చక్కగా అల్లి.. అలా.. తోరణాలు వేలాడదీసిన తీరు సాధారణ ఓటర్లతోపాటు కలెక్టర్‌ను, ఉన్నతాధికారులనూ ఆకట్టుకుంది. చూసిన వారంతా.. 'వావ్..' అనేలా వాటిని తయారు చేశారు. ఇందుకోసం డీఆర్డీవో విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వాటి తయారీ విధానాన్ని మొదటి తాను యూట్యూబ్‌లో చూసి నేర్చుకుని చేశారు. అనంతరం మిగితా సిబ్బందికి నేర్పించారు. అలా తయారు చేసిన వాటిని అందంగా పోలింగ్ కేంద్రాల్లో అలకరించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- జిల్లా వైద్యాధికారి ధనరాజ్



ఓ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: నిబంధనలు పాటించని ఆస్పత్రులపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో పలు ఆస్పత్రులు, ల్యాబ్‌లను శనివారం తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాగ్గత ఆయుర్వేద హాస్పిటల్, సుప్రియ డయాగ్నస్టిక్ ల్యాబ్, లక్ష్మీనరసింహ డయాగ్నస్టిక్ సెంటర్, సాధన నర్సింగ్ హోమ్‌కు నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రులు, పాలి క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు, ఐ క్లినిక్‌లు, ఆయుర్వేద, యనానీ, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారంరిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్పత్రులు గడువు ముగిసే సమయాని మూడు నెలల ముందే రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవల వివరాలు, చార్జీలు, ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ల వివరాలు ప్రదర్శించాలని వివరించారు. డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్ ఉన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై జెడ్పీ సీఈవోకు వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీ సీఈవో గోవింద్‌కు పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ లోన్లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, గృహ నిర్మాణం తదితర అవసరాల కోసం దాచుకున్న డబ్బులు సకాలంలో రాక ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. మిస్సింగులు వారివారి ఖాతాల్లోకి సకాలంలో జమయ్యేలా చూడాలని కోరారు. సీఈవో సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల రవిరాజ్, జిల్లా నాయకులు చక్రాల హరి ప్రసాద్, గంగాధర్, వొజ్జల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రూప్ –1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రూప్ –1 పరీక్ష అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నత అధికారులతో గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మాస్ కాపీయింగ్, లీకేజీలకు తావులేకుండా పరీక్ష నిర్వహించాలన్నారు. జిల్లాలో పరీక్ష కేంద్రాల ఎంపిక పూర్తిచేసి, నిర్వహణ బాధ్యతలు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు అప్పగించాలని సూచించారు. సంబంధిత అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి ఫర్నిచర్, సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను తనిఖీ చేయాలన్నారు. పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, కేంద్రాలకు మూడు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ విధించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ పత్రాల తరలింపు సమయంలో పోలీసు శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో పోలీసు భద్రతను కల్పించాలని, పరీక్ష కేంద్రాల్లోకి సిబ్బంది, అభ్యర్థులు మొబైల్ ఫోన్, ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకుండా చూడాలి వివరించారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని తెలిపారు. కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సిబ్బంది, మందులు, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష నిర్వహణలో లోపాలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జూన్ 9న నిర్వహించే గ్రూప్–1 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో 4,608 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్లను నియమిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు టోల్ ఫ్రీ నంబర్ 6305646600లో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ పి.గంగారెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధనరాజ్, ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, కలెక్టరేట్ ఏవో సూర్యరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు వివరాలు ట్యాబ్‌లో ఎంటర్ చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ట్యాబ్‌లో ఎంటర్ చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివిధ అంశాలపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం మిల్లులకు తరలించాలని సూచించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు వివరాలు, రైతుల సంఖ్య, మిల్లులకు తరలించిన లారీల వివరాలు, ట్యాబ్ ఎంట్రీ చేసిన సంఖ్య, పెండింగ్ ట్యాబ్ ఎంట్రీ వివరాలు, ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. రైతులకు డబ్బులు జమచేసేందుకు అవసరమైన డాక్యుమెంట్లు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, డీసీవో నర్సయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



జామ్‌లో ధాన్యం పరిశీలిస్తున్న కిశోర్‌కుమార్

సారంగాపూర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, తూకం వేసిన ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. మండలంలోని ఆలూరు, బోరిగాం, జామ్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష సూచనల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని ఆదేశించారు. గన్నీబ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. కేంద్రాలకు రైతులు తెచ్చిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటి వరకు తరలించిన ధాన్యం వివరాలు, ఇంకా ఉన్న నిల్వల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

కోత లేకుండా ధాన్యం కొనాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్



మాట్లాడుతున్న నూతన్ కుమార్

నర్సాపూర్ (జి): కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యంలో కోత విధించడం ఆపాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి నూతన్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధాన్యం తూకంలో కోతలు ఉండవని రైతులు ఆశించారని, కానీ గత పాలకుల హయాంలో కోత విధించినట్లుగానే కోత విధిస్తున్నారని ఆరోపించారు. 40 కిలోలకు బదులు 42 కిలోలు తూకం వేస్తున్నారని పేర్కొన్నారు. మిల్లర్లు 40 కిలోలకే లెక్క కడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, నాయకులు చందుల సాయికిరణ్, మన్నారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిమిషాంబిక అవతరణోత్సవం



నిర్మల్: జిల్లా కేంద్రంలోని కళానగర్‌లో నిమిషాంబిక ఆలయంలో అమ్మవారి అవతరణ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. నకాషీ సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులతో హోమం జరిపించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం స్థానిక వీధులలో ఉత్సవమూర్తితో పల్లకి సేవ నిర్వహించారు. ఇందులో నకాషీ సంఘం పెద్దలతోపాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని విఠాపూర్ గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీల అభివృద్ధికి సకాలంలో పన్నులు వసూలు చేయాలని కోరారు. నర్సరీల్లో మొక్కలు వాడిపోకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కవిత ఉన్నారు.

ఇనాం భూముల వేలం

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ అధీనంలో ఉన్న ఇనాం భూములను 2024–25 సంవత్సరానికి సాగుకోసం వేలం వేయనున్నట్లు తహశీల్దార్ లింగమూర్తి తెలిపారు. తానూరులో ఉన్న 165.35 ఎకరాలకు ఈనెల 20న తహశీల్దార్ కార్యాలయంలో, బామ్నిలో 3.18 ఎకరాల భూమికి 21న గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మహలింగిలో 32 గుంటల భూమికి 22న గ్రామ పంచాయతీ కార్యాలయంలో, బెంబరలో 11.33 ఎకరాలకు 23న గ్రామ పంచాయతీ కార్యాలయంలో, తొండాలో ఉన్న 8.11 ఎకరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 24న వేలం వేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు.

క్లుప్తంగా

బెదిరింపు కేసులో కౌన్సిలర్ భర్త అరెస్ట్

భైంసాటౌన్: రియల్ ఎస్టేట్ వ్యాపారిని డబ్బుల కోసం బెదిరించిన కేసులో భైంసా పట్టణానికి చెందిన కౌన్సిలర్ భర్త బాలాజీ సూత్రావేను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ డి.రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన అరవింద్ రాహుల్‌నగర్‌లో ప్లాట్లు చేసి విక్రయిస్తుండగా బాలాజీ సూత్రావే డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. రూ.20 లక్షలు ఇస్తేనే ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయనిస్తానని, లేదంటే చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. దీంతో బాధితుడు అప్పు చేసి రూ.10 లక్షలు ఇవ్వగా మరో రూ.పది లక్షలు సర్దుబాటు కాకపోవడంతో నేతాజీనగర్‌లోని ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. మిగిలిన డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు. బాలాజీ సూత్రావేను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా కోర్టు 14రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించినట్లు ఆయన వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న దయాకర్, గణేశ్, సయ్యద్ బాబు, శేక్ రసూల్, తాండ్ర సాయన్న, తరుణం శంకర్, బొడ్డు మహేందర్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.31వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మామిడి పండ్ల అపహరణ

ముథోల్: మండల కేంద్రానికి చెందిన రైతు షఫీఉల్లాఖాన్ 8 క్యారెట్ల మామిడి పండ్లు అపహరణకు గురయ్యాయి. ఆశ్రమ పాఠశాల ముందున్న మామిడి తోటలో నుంచి శుక్రవారం 8 క్యారెట్ల మామిడి పండ్లు తెంపి మార్కెట్‌కు తరలించేందుకు ఒక గదిలో ఉంచాడు. శనివారం ఉదయం చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. మామిడి పండ్ల విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి


సంఘటనస్థలంలో గేదె

కడెం: మండలంలోని ఉడుంపూర్‌లో శనివారం విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి చెందాయి. మక్కచేనులోకి మేతకు వెళ్లిన గేదెలు విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందాయి. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, బాధిత రైతులు సంజీవ్, మహేశ్, సువర్ణ ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన ఏఈపై చర్యలు తీసుకోవాలని డీఈకి వినతి పత్రం అందజేశారు.

WANTED
Qualified
M.Sc. Nursing,
B.Sc. Nursing
faculty to teach
in our College.
SRKM College of Nursing
ESTD: 2003 Mancherial- T.S.
Cell: 9866231292, 9866509614, 8374585229

పిల్లలపై ఓ కన్నేయండి...!



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రతిరోజు ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడు. ఇది గ్రహించిన తల్లిదండ్రులు ఆరా తీయగా రోజూ తన మిత్రులతో కలిసి జిల్లా కేంద్రం సమీపంలో కూర్చుని బీర్లు తాగుతున్నట్లు తెలిసింది. ఒక్కోసారి డబ్బులు సరిపోకపోవడంతో మత్తు కోసం మాత్రలు కూడా వాడుతున్నట్లు తెలిసింది. విపరీత ప్రవర్తనను గమనించిన తల్లిదండ్రులు మానసిక వైద్యుని సంప్రదించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

ఇటీవల సారంగాపూర్ మండలంలోని బోరిగాం గ్రామంలో పదమూడేళ్ల బాలుడు మొబైల్ ఫోన్‌కు బాగా అలవాటుపడ్డాడు. రోజంతా సెల్‌ఫోన్లలో సోషల్ మీడియా, రీల్స్ తదితర మాధ్యమాల్లో మునిగితేలుతుండడంతో ఆ అలవాటు మాన్పించాలని అతని తండ్రి మందలించాడు. అయితే మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



నిర్మల్ సమీపంలోని జాతీయ రహదారిపై రాత్రి 9 గంటల తర్వాత దాదాపు 18 నుంచి 25 సంవత్సరాల లోపు యువకులు ద్విచక్ర వాహనాలపై ఇష్టారీతిన నడుపుకుంటూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు చిక్కారు. ఆరా తీస్తే అప్పటికే వారు దాబాహోటల్‌లో మద్యం సేవించి ఇంటికి తిరిగి వస్తున్నట్లు తెలిసింది. పోలీసులు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి మందలించి ఇంటికి పంపించారు.



- జిల్లాలో విందులు, వినోదాల పేరిట పెడదారిన టీనేజ్ యువత..
- సిగరెట్లు, మద్యపానం ఫ్యాషన్‌గా భావిస్తున్న యువకులు
- విందులు, వినోదాల పేరుతో సెలవులు దుర్వినియోగం
- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుతం జిల్లాలో పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవుల కాలం కొనసాగుతోంది. అయితే ఈ దశలో ఉన్న పిల్లలు, టీనేజ్ యువత పక్కదారులు పడుతున్నట్లు తెలుస్తోంది. వేసవి సెలవుల కాలాన్ని దుర్వినియోగం చేస్తూ సిగరెట్లు, మద్యం, మొబైల్ ఫోన్ వంటి ఇతర దురలవాట్లకు బానిసగా మారుతున్నట్లు ఇటీవలి కొన్ని ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. మత్తు కోసం మాత్రలు, గంజాయి వంటి వాటిని ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అర్ధరాత్రి వేళల్లో సైతం బైక్‌లపై రైడ్ల కోసం కోసం జాతీయ రహదారిపై తిరుగుతున్నారు. దాబా హోటళ్లలో మద్యం సేవించి ఇష్టారీతిన ప్రధాన రహదారిపై తిరగడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఇవి కాకుండా కొత్తగా కొన్ని రకాల శీతల పానీయాల్లో చాక్లెట్ల వంటి పదార్థాలు కలుపుకుని మత్తును ఆస్వాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పలు కేసులు మానసిక వైద్యుల వద్దకు వస్తున్నట్లు సమాచారం. మత్తుకు బానిసైన వారిలో ఎక్కువగా కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె వంటి అవయవాలపై ప్రభావం పడడమే కాకుండా మతిమరుపు, రక్తహీనత, నరాల బలహీనత వంటి వ్యాధులకు కారణమవుతాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి సమయాల్లో పిల్లలు యువత ప్రవర్తనపై వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

చెడు స్నేహాలు దరిచేరనీయొద్దు



మానవుని జీవిత కాలంలో టీనేజ్ అత్యంత కీలకమైన దశ. ఈ వయసు వారిలో పిల్లలు, యువత చాలా ఉత్తేజ స్థితిలో ఉంటారు. ఇలాంటి వారిపై వారి తల్లిదండ్రులే తగిన జాగ్రత్తలు వహిస్తూ క్రమశిక్షణలో ఉంచుకోవాలి. అనుక్షణం వారిని పర్యవేక్షించాలి. వేసవి సెలవులను వృథా చేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధంకావడం, ఉన్నత తరగతుల పుస్తకాలు చదవడం, క్రీడల కోసం శిక్షణ తీసుకోవడం వంటి అలవాట్లవైపు వారి దృష్టి మళ్లించాలి. చెడు స్నేహాలకు దూరంగా ఉంచాలి.

– డా.అల్లాడి సురేష్, మానసిక వైద్యనిపుణులు, నిర్మల్

ఇంటర్‌లో ప్రవేశానికి
స్పాట్ కౌన్సెలింగ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ల కోసం ఈ నెల 23, 25 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులకు 23న బాలికలకు ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని గిరిజన గురుకుల (బాలికల) కళాశాలలో, 25న గిరిజన గురుకుల (బాలుర) కళాశాల లాల్‌టెక్డీలో కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన ఎస్టీ, ఇతర విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఆసక్తి కలవారు ధ్రువీకరణ పత్రాలు రెండు జతల జిరాక్స్, 4 పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలతో ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

'అధికారులు తీరు మార్చుకోవాలి'

శ్రీరాంపూర్: అధికారులు తమ తీరు మార్చుకోవాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. శనివారం ఎస్సార్పీ1 గనిలో కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కొందరు అధికారులు బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లకు తొత్తులై ఇన్నాళ్లు పనిచేశారని ఇప్పుడు కూడా అదే విధానం కొనసాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఐఎన్టీయూసీని బదనాం చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాంటి అధికారులను ఉపేక్షించేది లేదని, కార్మికుల క్షేత్రంలో వారిని నిలదీస్తామన్నారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. పనిస్థలాల్లో వెంటిలేషన్ సౌకర్యం మెరుగుపర్చాలని, కార్మికులకు టూల్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలని, మ్యాన్‌రైడింగ్ యంత్రాన్ని షిఫ్టుకు 10 నిమిషాల ముందే ప్రారంభించాలని, క్యాంటీన్‌లో సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యామ్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ కల్లును అరికట్టాలి'


మాట్లాడుతున్న ఏబీఎం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో కల్తీ కల్లు వ్యాపారాన్ని వెంటనే అరికట్టాలని ఆదివాసీ భారత్ మహాసభ (ఏబీఎం) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరా సుక మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండల కేంద్రాల్లో, పల్లెల్లో కల్తీ కల్లు వ్యాపారం జోరుగా సాగుతోందని ఆరోపించారు. మద్యం ప్రియులను మత్తులోకి ముంచేందుకు గుల్బార్క్, కఫ్ పౌడర్, యూరియా లాంటి విష పదార్థాలు కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కల్తీ కల్లును నియంత్రించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏబీఎం జిల్లా అధ్యక్షుడు కినక సరేష్, నాయకులు దీపక్, వినోద్, వామన్, రమేశ్, ప్రదీప్, సాకారాం, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు డబ్బాలతో అన్నదాతల నిరసన

- పోస్టాఫీస్ ఎదుట ఆందోళన


నిరసన తెలుపుతున్న అన్నదాతలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్ ఎదుట శనివారం అన్నదాతలు ఆందోళనకు దిగారు. గత మార్చిలో సీసీఐ ద్వారా పత్తి విక్రయించిన అన్నదాతలకు సంబంధించిన నగదును ఐపీపీబీ మేనేజర్ విజయ్ కుమార్ తన సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. ఈ విషయమై రైతుల ఫిర్యాదు మేరకు సదరు మేనేజర్‌పై కేసు నమోదు చేశారు. నెలలు గడుస్తున్నా తమ ఖాతాల్లోకి నగదు జమ కావడం లేదని అన్నదాతలు పురుగుమందు డబ్బాలతో నిరసన చేపట్టారు. పోస్టల్ అధికారులు గతంలోనే నెల తర్వాత ఖాతాలో డబ్బులు జమవుతాయని చెప్పినప్పటికీ ఇంతవరకు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 15 రోజులపాటు వేచి చూడాలని అధికారులు చెబుతున్నారని, పంట సాగు కాలం సమీపిస్తున్న దృష్ట్యా వీలైనంత త్వరగా నగదును తమ ఖాతాల్లో జమచేసి న్యాయం చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోస్టల్ అధికారుల హామీతో ఆందోళన విరమించారు.

ట్రిపుల్ తలాక్ చెప్పిన వ్యక్తిపై కేసు


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: ట్రిపుల్ తలాక్ చెప్పిన వ్యక్తిపై ఆదిలాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం వివరాలను వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన జాస్మీన్ అనే మహిళకు 2017లో అబ్దుల్ అతీక్‌తో వివాహమైంది. దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు న్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో గతేడాది ఫిబ్రవరిలో అబ్దుల్ అతీక్‌పై వేధింపుల కేసు నమోదైంది. భర్త నుంచి దూరంగా ఉంటున్న ఆమె మెయింటెనెన్స్ కోసం కోర్టులో కేసు వేయగా నెలకు రూ.7వేల చొప్పున ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. నాలుగు నెలలుగా డబ్బులు ఇవ్వకుండా ఆమెకు ట్రిపుల్ తలాక్ ఇస్తున్నట్లుగా ఈ నెల 11న వాట్సాప్ ద్వారా రెండు నిమిషాల నిడివి గల సందేశం పంపించాడు. ఇక నుంచి నీకు నాకు ఎలాంటి సంబంధం లేదని అందులో పేర్కొన్నారు. దీంతో ఆవేదనకు గురైన బాధితురాలు శనివారం మహిళా పోలీస్ స్టేషన్ అధికారులను ఆశ్రయించింది. 2019లోనే ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ ను రద్దు చేస్తూ ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన విషయం తెల్సిందే. దీంతో అతీక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి


చిన్న రాజన్న మృతదేహం

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు మాటు కాలువలో జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని ఒడ్డెపెల్లి గ్రామానికి చెందిన పల్లపు చిన్న రాజన్న(52) శనివారం రాచాపూర్ శివారులో కల్లు తాగడానికి వచ్చి కాలకృత్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా జారిపడి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని కోర్వగల్లికి చెందిన జింక సతీష్ (35) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ కథనం ప్రకారం.. బోథ్‌కు చెందిన సతీష్ ఉపాధి నిమిత్తం మూడునెలల కిందట భైంసా పట్టణానికి కుటుంబంతో సహా వలస వచ్చాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్య కళావతి, అక్కలపెల్లి రవీందర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ సతీష్ తెలిపారు. మండలంలోని రహపల్లి గ్రామంలో ఈనెల 16న రాత్రి జరిగిన సంఘటన. అక్కలపెల్లి రవీందర్‌తో వివాహేతర సంబంధం పెటుకున్న కళావతి ప్రియుడితో కలిసి భర్త చున్నాకర్ రవీందర్‌ను హత్యచేసి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఇంట్లో దూలానికి వేలాడదీశారు. నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఒక ప్రకటనలో తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

నెన్నెల: మైలారం గ్రామానికి చెందిన యు వతి (18) నాలుగు రోజులుగా కనిపించడం లేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఈ నెల 14న బెల్లంపల్లికి బట్టలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి వెంక అభి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో పూజారి మృతి


టేకం పోషం మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి భీమన్న ఆలయ పూజారి పోషం (68) శనివారం తేనెటీగల దాడిలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని రేకులగూడకు చెందిన పోషం (68) గోలేటి టౌన్‌షిప్ లోని భీమన్న ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటలు చేసుకునే కట్టెలతో పొయ్యి వెలిగించారు. దీంతో పొగ వ్యాపించడంతో సమీపంలోని వేపచెట్టుపై ఉన్న తేనెటీగలు మూకుమ్మడిగా దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన పోషం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మామిడికాయల దొంగలు అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాలీ

నెన్నెల: మామిడికాయలు దొంగిలించి వాహనంలో తరలిస్తున్న పది మందిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపారు. బొప్పారం శివారులో ఓ రైతుకు చెందిన తోటను మందం శ్రీనివాస్‌రెడ్డి లీజ్‌కు తీసుకున్నాడు. రాత్రిపూట పది మంది ఆ తోటలో చొరబడి 15 క్వింటాళ్ల మామిడి కాయలు కోసుకుని టాటా ఏసీ ట్రాలీ వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తుండగా నెన్నెల టీ రోడ్డు వద్ద తెల్లవారుజామున 3 గంటలకు పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసిన నిందితులు వాహనాన్ని వదిలి పారిపోయేందుకు యత్నించగా వారిని వెంబడించి పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా మామిడి కాయలు దొంగలించి అమ్ముకునేందుకు మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎస్సై పేర్కొన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఈఏపీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ


కే.రాహుల్


ప్రతిభ చాటిన ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈఏపీ సెట్ –2024 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన రాహుల్ రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించారు. 160 మార్కులకుగానూ 132.87 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. రాంనగర్‌కు చెందిన ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మధుకర్–నంద దంపతుల కూతురు వర్షతేజ 720 వ ర్యాంకు సాధించింది. 160 మార్కులకు గాను 100.55 మార్కులు సాధించి సత్తా చాటింది. ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈఏపీ సెట్‌లో ప్రతిభ కనబర్చారు. దోటి అవినాష్ 3,210, కనక ఓం దోటి ఆదిత్య 6,272, అనూ 6,634, దోటి ఆదిత్య 7,019, దొడ్డి చందు 7,775, క్రిష్ణ 8,171తో పాటు పలువురు విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. విద్యార్థులను ఎస్ఆర్ కళాశాలల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు జైపాల్‌రెడ్డి, బ్రహ్మం, అరవింద్ , అధ్యాపకులు అభినందించారు.

ఈఏపీ సెట్‌లో 'ఎస్ఆర్' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

నిర్మల్ రూరల్: ప్రభుత్వం శనివారం ప్రకటించిన ఈఏపీ సెట్‌లో జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన జెట్టి శ్వేత 2,623 ర్యాంకు సాధించి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిందని, మిగతా విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వరదరెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జూనియర్ ఇన్‌చార్జి దేవిదాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భయాందోళన సృష్టించిన ఎద్దులు


పోట్లాడుకుంటున్న ఎద్దులు

బెల్లంపల్లి: పట్టణంలోని బజార్ ఏరియా ప్రాంతంలో శనివారం రాత్రి ఆంబోతులు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. రోడ్డు పైకి వచ్చిన రెండు ఆంబోతులు ఒక్కసారిగా కుమ్ములాటకు దిగాయి. డివైడర్‌కు అటు ఇటుగా ఆంబోతులు కొమ్ములతో కలబడి తీవ్ర భయభ్రాంతులకు గురిచేశాయి. రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోడ్డు మీద నడిచి వెళ్లే పాదచారులు షాపులకు పరుగులు పెట్టారు. కొందరు యువకులు కర్రలు పట్టుకుని ఆంబోతులను విడగొట్టడానికి యత్నించిన ప్రయోజనం లేకుండా పోయింది. బజార్ ఏరియా రోడ్ నంబర్ 3 గల్లీ వద్ద నుంచి రోడ్ నంబర్ 4 , పై గల్లీ వరకు రంకెలు వేస్తూ భయానక పరిస్థితులు కల్పించాయి.పెద్ద ఎత్తున జనం గుమిగూడి కర్రలు పట్టుకుని అదిరిస్తూ అతి కష్టంగా రెండింటిని విడగొట్టారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇల్లందు క్లబ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వావిలాలకు చెందిన కుర్మ రాధమ్మ(60) అల్లుడు ఇటీవల చనిపోగా ఆదివారం నిర్వహించనున్న దశదినకర్మ కోసం శనివారం మందమర్రికి వచ్చింది. స్థానిక ఇల్లందు క్లబ్ వద్ద బస్సు దిగి సీఎస్పీ రోడ్డు వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

■ We Are Ready to Invest Long Term Projects All Over the World. Contact: +91 8754809650 [IA-7027]

■ పెట్టుబడి పెట్టండి, అధిక లాభాలు పొందండి, మాది అతి పెద్ద రైస్ & ఫుడ్ బిజినెస్, పార్టనర్స్ కావలెను. రోజూ లారీ రైస్ అమ్మును, 29 వేలు లాభం, రిటైరైన వారు, ఫైనాన్స్ ఇన్వెస్ట్ చేయువారు, కొత్తగా వ్యాపారం పెట్టేవారు, బిజినెస్‌లో ఆసక్తి గల & ఏ జాబ్ లేనివారు డైరెక్ట్: 9989682256 [HA-2223]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185083]

■ మా కంపెనీలో పనిచేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. వయసు 18 నుండి 26 సంవత్సరాలు లోపు వారు చదువు అవసరం లేదు. వసతి ఫ్రీ. జీతం: 10000–15000. సంప్ర॥ 9849316058 [W-1242458]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-14041]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,